

పుట్టిన రోజు వేడుక

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొండారెడ్డి బురుజు వద్ద కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, చిత్రంలో పార్టీ నాయకుడు రాజా విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

మహిళా క్రీడాకారులను ప్రోత్సహించడం హర్షణీయం



విజేత జట్టుకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్) : ఖేలో ఇండియా పేరుతో మహిళా క్రీడాకారులను ప్రోత్సహించడం హర్షణీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా రగ్బీ ముగింపు పోటీలు, బహుమతుల ప్రదానం కార్యక్రమం జరిగింది. అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీనియర్ మహిళల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన విశాఖపట్నం జట్టుకు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుకు రూ. 20 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కేజే రెడ్డి, ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్, రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



1వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (రాజ్‌విహార్) : నగరంలోని 1వ వార్డులో జరుగుతునన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో డ్రైనేజీ, మంచినీరు, కల్వర్టు, రోడ్లు, వీధి దీపాలు తదితర ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. బుధవారం వార్డులో పర్యటించి వాటిన ఇపరిశీలించారు. అలాగే స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షాషావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్‌షావలి, షానవాజ్ ఖాన్, వేదవతి, మహబూబ్ బాషా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యేలు సుధాకర్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (సిటీ): నగరపాలక సంస్థ పరిధిలోని బాలాజీ నగర్‌లో సచివాలయ కన్వీనర్లు కరీం, ఇర్షాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విక్రమ్ సింహారెడ్డి, సాంబ శివరావు, కర్నూలు జెడ్పీటీసీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ పంపిణీ

కర్నూలు (టౌన్) : ఈనెల 22 నుంచి జరగనున్న సౌత్‌జోన్ స్థాయి యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎస్. రెహ్మాన్ చెప్పారు. బుధవారం ఆవర్సిటీలో వాలీబాల్ పురు షుల జట్టుకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేశారు.

ఉషూ పోటీల్లో పతకాలు

కర్నూలు (టౌన్) : ఈనెల 18 వ తేదీ స్థానిక కిడ్స్ వరల్డ్‌లో రోశయ్య కమ్యూనిటీ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ఉషూ క్రీడా పోటీల్లో కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటి 12 బంగారు, 15 వెండి, 9 కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులను బుధవారం కళాశాల ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిక రాణి అభినందించారు.

సంక్షిప్త సమాచారం

● ఓటరు జాబితా పరిశీలకుడిని కలిసిన జేసీ

కర్నూలు (సెంట్రల్): జిల్లాకు వచ్చిన ఓటరు జాబితా పరిశీలకుడు, ఏపీఎంఎస్ఐడీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మురళీధరరెడ్డిని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబరులో ఆమె ఆయనను కలసి జిల్లాలోని ఓటరు జాబితా రూపకల్పన గురించి వివరించారు.

● ప్రతి గడపకూ లబ్ధి చేకూరింది

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో రాష్ట్రంలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, మహిళ విభాగం కర్నూలు, అన్నమయ్య జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) గాజుల శ్వేతారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 31వ వార్డు శరీన్‌నగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.

● కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

కర్నూలు (లీగల్) : భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరుతూ న్యాయవాదులు రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తున్నారు. బుధవారం దీక్షలో పలువురు న్యాయవాదులు కూర్చున్నారు.

● 23న భగవద్గీత సహస్ర గళ పారాయణం

కర్నూలు కల్చరల్: విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23వ తేది గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీత సహస్ర గళ పారాయణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డి.వి. రమణ వెల్లడించారు. బుధవారం సంకల్ బాగ్‌లోని సంఘం కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

● హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్‌కు భద్రత కల్పించలేని హోంమంత్రి అమిత్‌షా ఆ పదవికి రాజీనామా చేయాలని ఎస్‌డీపీఐ జిల్లా కార్యదర్శి వకీల్‌అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో భద్రత వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

● పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

● హెచ్ఐవీ, కుష్టు బాధితులకు దుప్పట్ల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ, కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారికి ఆడిటర్ జి.బుచ్చన్న సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ వారు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక నందికొట్కూరు రోడ్డులోని అభయగిరిలో ఉన్న బాధితులను వారు సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు దామెర ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

● ఏపీజీఎల్ఐ అధికారికి సన్మానం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో అసిస్టెంటు డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన వై.వెంకటేశ్వర్లు పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్‌గా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో ఆయనను కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కృష, ఏపీజీఎల్ఐ కార్యాలయం పర్యవేక్షకులు పి.రామకృష్ణారెడ్డి, గౌరి, మాధవీకళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

● ఏకపక్షంగా క్లస్టర్ల ఏర్పాటు ప్రతిపాదనలు చేయొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకపోయినా పశుసంవర్ధక శాఖలో క్లస్టర్ల ఏర్పాటును ముమ్మరం చేయడం మంచిది కాదని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఎదుటనున్న ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు బజారు, వెటర్నరీ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

● బేడ బుడగ జంగాలకు న్యాయం చేయండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బేడ బుడగ జంగం కులానికి న్యాయం చేయాలని సంఘం నేతలు తూర్పాటి మనోహర్, అంజి కోరారు. ఢిల్లీలోని సోషల్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఇండియా ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్‌గార్గ్, సామాజిక న్యాయ సహాయ మంత్రి నారాయణస్వామికి వినతి పత్రాలు అందించామన్నారు. అలాగే మన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కలిసి వినతులు ఇచ్చినట్లు బుధవారం వెల్లడించారు.